సమస్యల పరిష్కారంలో ముందుండాలి


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ముందుండాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ సూచించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ పట్టణ ప్రణాళికాధికారి వీబీ శ్రీనివాస్‌రావు, మారేడుపల్లి తహసీల్దార్ భూపతి గౌడ్ శుక్రవారం ఆయనను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రణాళికా విభాగం కార్యకలాపాలు, రెవెన్యూ కార్యాలయ సేవలను ప్రజలకు మరింత అందుబాటులో తేవాలని, కొత్త భవనాల నిర్మాణాల అనుమతుల్లో పారదర్శకతను పాటించాలని సూచించారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

వినాయక నవరాత్రులను పురస్కరించుకుని నియోజకవర్గంలో చేపట్టిన రహదారుల పనులు సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సూచించారు. చిలకలగూడ మైలార్‌గడ్డ నుంచి సీతాఫల్‌మండి నామాలగుండు వరకు రూ. 53 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారి పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ జాకెట్స్, షూస్ పంపిణీ


సేఫ్టీ జాకెట్స్, షూస్‌తో పారిశుద్ధ్య కార్మికులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాలనీలోని పలువురు దాతల సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ జాకెట్స్‌తో పాటు షూస్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఇకో కాస గ్రాండ్ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన సుశీల, సాయి స్కెక్టోకు చెందిన శశికళ, ఈస్ట్ క్రెస్ట్‌కు చెందిన డీపీనాయుడు, మొక్కపాటి భాస్కరం అందజేసేందుకు ముందుకువచ్చారు. ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్ అతిథులుగా హాజరై అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్ సోమ, శారద, ప్రసాద్‌రాజు, రామసుబ్బారెడ్డి, భాషా, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, గోవింద్‌రెడ్డి, అనంతరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బాలకృష్ణ, విజయకుమార్, రవీందర్, చీరంటనా తదితరులు పాల్గొన్నారు.

2న ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో మిగిలిన సీట్లకు వచ్చే నెల 2న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. గతంలో మిగిలిన సీట్లను మరుసటి సంవత్సరం డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కల్పించారు. కానీ కాలేజీ చరిత్రలో తొలిసారిగా మిగిలిన సీట్లకు టీజీఈఏపీసీఈటీ-2024 అధికారుల ఆదేశాల మేరకు స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు. ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాల్లో మిగిలిన సీట్ల వివరాలు. బయో మెడికల్ ఇంజినీరింగ్ విభాగంలో 6 సీట్లు, మెకానికల్-1, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో మిగిలిన 19 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే 2న కాలేజీలో జరిగే స్పాట్ అడ్మిషన్స్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఎంసెట్ ర్యాంక్ లేదా ఇంటర్‌లో మార్కుల శాతంతో సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం


మందులు అందజేస్తున్న వైద్యురాలు

చిలకలగూడ : వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో రోగాలు దరిచేరవని, ప్రతిఒక్కరూ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చిలకలగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) వైద్యాధికారిణి డాక్టర్ ఫణి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ మార్కండేయనగర్ పార్కులో శుక్రవారం ఉచిత వైద్యశిబిరంతో పాటు శ్రీనివాసనగర్, ఫ్రైడేమార్కెట్, మార్కండేయనగర్, వేంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దోమలతో వ్యాప్తి చెందే రోగాలు, నివారణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో సుమారు 100 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సిబ్బంది రాణి, లక్ష్మీ, శిరీష, ఆశా వర్కర్లు రేఖ, రజిత, అనిత, మంజు, ఉష, వైశాలి, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ అధికారి రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంను ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. తెలంగాణ ఉద్యమంతో పాటు రాజకీయ, వర్సిటీల పరిస్థితి, ఇతర అంశాలపై చర్చించారు. యూజీసీ నిబంధనల ప్రకారం వర్సిటీల అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏండ్లు పెంచేందుకు ప్రభుత్వంతో చర్చించాలని కోరినట్లు ఔటా జనరల్ సెక్రెటరీ ప్రొ.సురేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు.కిషన్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, హరిసింగ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందే'


దీక్ష చేపట్టిన నాయకులకు మద్దతు ప్రకటిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్

గాంధీఆస్పత్రి : కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల హామీని తక్షణమే అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచి, కుల గణన చేపట్టాలనే డిమాండ్లతో బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్‌పటేల్ గాంధీ ఆస్పత్రిలో కొనసాగిస్తున్న ఆమరణ నిరాహారదీక్ష ఆరో రోజుకు చేరింది. ఆయన శుక్రవారం వారిని పరామర్శించి, మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ దీక్ష చేపట్టిన నాయకుల ఆరోగ్యం క్షీణించక ముందే వారి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. బీసీ ఉద్యమానికి తమవంతూ సహాయ సహకారాలు అందిస్తా మన్నారు. పలు బీసీ సంఘాలకు చెందిన నాయకులు దాసు సురేశ్, కాసాని శ్రీనివాస్ రావు, చామకూర రాజు, కేవి గౌడ్, ఎర్ర రమేశ్ అంబాల నారాయణ గౌడ్, కొంగర నరహరి, విజయ్ కుమార్, జీడీ వెంకటేశ్, చెరుకు శివ, సుజ్జి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తకు జైలు


దుర్గేశ్

చిలకలగూడ : భార్యను వేధిస్తున్న కేసులో భర్తకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌కు చెందిన పీవీ దుర్గేశ్ (38) లావణ్య భార్యభర్తలు. మనస్పర్థాలతో వేర్వేరుగా ఉంటూ ఫ్రైడే మార్కెట్ వద్ద పూల వ్యాపారం నిర్వహిస్తున్నారు. దుర్గేశ్ రోజు మద్యం తాగి లావణ్యకు చెందిన పూల దుకాణం వద్దకు వచ్చి దుర్భాషలాడుతున్నాడు. ఈనెల 28న షాపు వద్ద భార్య లావణ్యపై బ్లేడుతో దాడి చేసేందుకు యత్నించాడు. దీంతో భార్యతో పాటు స్థానికుల ఫిర్యాదు మేరకు దుర్గేశ్‌ను అదుపులోకి తీసుకుని సీపీ యాక్టు ప్రకారం ఈ పెట్టీ కేసు నమోదు చేసి సికింద్రాబాద్ 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరు పర్చారు. వీడియోలతో పాటు కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పరిశీలించిన న్యాయమూర్తి రవిశంకర్ దుర్గేశ్‌కు ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఉత్తర్వులు ప్రకారం దుర్గేశ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇక పకడ్బందీగా ఓటరు జాబితా!

- లష్కర్‌లో మొదలైన సవరణ ప్రక్రియ
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌వోలు
- ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక్కో ఆఫీసర్ నియామకం
- పర్యవేక్షణకూ సైతం అధికారుల కేటాయింపు
- వివరాలన్నీ యాప్‌లో నమోదు

ప్రస్తుత ఓటర్ల వివరాలు	
పురుషులు:	1,32,781
మహిళలు:	1,33,174
ఇతరులు:	27
మొత్తం:	2,65,982


ఓటర్ల వివరాలు సేకరిస్తున్న బూత్‌లెవెల్ ఆఫీసర్లు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2024-25 జాబితా ముసాయిదాను మరింత పకడ్బందీగా రూపుదిద్దేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కో పోలింగ్‌బూత్‌కు ఒక్కో బూత్‌లెవల్ ఆఫీసర్‌ను, పర్యవేక్షణకు 22 మంది అధికారులను నియమించారు. ఇప్పటికే వారికి ఆన్‌లైన్ ద్వారా ఓటర్ల సవరణ వివరాలు నమోదు చేయడంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. నియోజకవర్గంలో 220 మంది బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు నమోదు చేస్తున్నారు.

మరిన్ని జాగ్రత్తలు..

ఓటరు జాబితా సవరణ ప్రక్రియ యేటా జరిగేదే అయినప్పటికీ.. ఈ ఏడాది మరిన్ని జాగ్రత్తలు తీసుకుని తప్పులకు తావు లేకుండా పకడ్బందీగా రూపొందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. గతంలో బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇంటింటి పర్యటనలు సక్రమంగా చేయకపోవడం, తక్షణ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఉన్నప్పటికీ నేరుగా ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించడం వంటి తప్పిదాలు చేసేవారు. కొందరు కార్యాలయ సిబ్బంది పని భారాన్ని తగ్గించుకునేందుకు వచ్చిన దరఖాస్తులను సక్రమంగా పరిశీలించకపోవడంతో దరఖాస్తుల వివరాల నమోదు అయ్యేవి కావు. అయితే ఇప్పుడు అలాంటి తప్పిదాలకు తావు లేకుండా బీఎల్‌ఓలు సక్రమంగా పని చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అన్నీ ఆన్‌లైన్‌లోనే..

సేకరించిన ప్రతీ ఓటరు వివరాలను బూత్‌లెవల్ ఆఫీసర్లు తమకు అందించిన యాప్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు మొదలు మృతుల పేర్ల తొలగింపు, చిరునామా, పేర్ల సవరణలు అన్నీ యాప్‌లోనే నమోదు చేస్తున్నారు. బూత్‌లెవల్ ఆఫీసర్ల శిక్షణ సమావేశంలో ఇంటింటి పర్యటనల ద్వారా ఓటర్లందరినీ కలిసి వారు సదరు చిరునామాల్లో ఉంటున్నదీ లేనిదీ కచ్చితంగా నిర్ధారించుకోవాలని డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు ఆదేశించారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులు

అవగాహన తరగతులు..

కళాశాలలు, పాఠశాలలు మొదలు నియోజవర్గం అంతటా ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించి అవగాహన కార్యక్రమాల నిర్వహణకు జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మరికొద్ది రోజుల్లోనే కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటరు జాబితా ముసాయిదాను పకడ్బందీగా రూపొందిస్తామని డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో శుక్రవారం రూ 10.11 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరీ శ్రీహరి, కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, మల్లికార్జున్‌గౌడ్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, వెంకటేషన్‌రాజు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి ఇష్టం లేదని..

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

సికింద్రాబాద్: పెళ్లి ఇష్టం లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్-చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్‌పై మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు గుర్తింపు కార్డు ఆధారంగా మృతుడు ఘట్‌కేసర్‌కు చెందిన కేవీ నరసింహమూర్తి (38)గా నాచారంలోని పవర్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అతడికి కుటుంబ సభ్యులు కొద్దిరోజుల క్రితం బలవంతంగా పెళ్లికుదిర్చి నిశ్చితార్థం కూడా చేశారు. దీంతో మనస్తాపం చెందిన నరసింహమూర్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫామ్ సమీపంలోని ఫుట్ ఓవర్ వంతెన మీద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది వెళ్లి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వివరాలు లభించలేదు. మృతుడు గులాబీ రంగు గల్లా చొక్కా, నీలిరంగు నైట్ ప్యాంట్ వేసుకున్నాడని తెలిసిన వారు ఉంటే 8712568581 నంబర్‌లో తమను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

బౌద్ధనగర్: గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని ఈస్ట్ జోన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారాసిగూడలోని ఏసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీ షీటర్లు అల్లర్లకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సైదులు, అనుదీప్, ఎస్ఐలు సుధాకర్, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సనత్‌నగర్: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు బేగంపేటలోని ఎయిర్‌టెల్ ఉద్యోగులకు శుక్రవారం 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ 2 రోజుల క్రితం బేగంపేట ఫ్లైఓవర్‌పై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పిలియన్ రైడర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మరవకముందే తార్నాకలో మరో వ్యక్తి హెల్మెట్ లేకుండా వెళ్తూ మరణించారన్నారు. హెల్మెట్ వస్తువు కాదని, ప్రాణాలు కాపాడే ఆయుధమన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ మిట్టల్, సంస్థ ఉద్యోగులు శివమ్ భార్గవ, వాగీశ, గీత, సంతోష్‌కుమార్, అబ్దుల్ మాజిద్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

రామయ్య సేవలు ప్రశంసనీయం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఆఫీస్ సూపరింటెండెంట్ (ఓఎస్)గా భమిడిపాటి రామయ్య అందించిన సేవలు ప్రశంసనీయమని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి కొనియాడారు. గాంధీ సెమినార్ హాల్‌లో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందుతున్న రామయ్యతోపాటు సతీమణి జయప్రద దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శాలువా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ సుభోద్‌కుమార్, గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్‌ఓడీ శ్రవణ్‌కుమార్, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో పూజలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ జీరాలోని సుప్రసిద్ధ శ్రీ సంతోషిమాత ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. మహిళలు పసుపు బొట్టు కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీ అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా కార్పొరేటర్ కె. హేమలత, శ్రీ సంతోషిమాత ఆలయ కమిటీ ప్రతినిధులు మనోజ్‌కుమార్ గౌడ్, ప్రేమ్‌కుమార్, గణేశ్, సంజయ్, అరుణ్, కృష్ణరాజు, అనుపమ, విజయేందర్ రెడ్డి, కుమార్ యాదవ్, శివ, రాజు, శ్రీనివాస్, అంజన్ యాదవ్, భార్గవచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మహాఅన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

వరలక్ష్మీ వ్రతంలో హర్యానా గవర్నర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ వారాసీగూడలోని బీజేపీ మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ నివాసంలో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం, పూజలు జరిగాయి. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గ పలువురు బీజేపీ నాయకులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, నాయకులు పీ.రవిప్రసాద్‌గౌడ్, దత్తు, కనకట్ల హరి, అంబాల రాజేశ్వర్‌రావు, వెంకటేశ్ గౌడ్, అజయ్‌నాయుడు, ప్రభు గుప్తా, శారదా మల్లేశ్, నగరపు శ్యాం పాల్గొన్నారు.

'ఎంపీ ఈటల క్షమాపణ చెప్పాలి'

సనత్‌నగర్: సోషల్, డిజిటల్ మీడియాను అవహేళన చేస్తూ..ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి ఈ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమకాలీన రాజకీయ, సామాజిక ఇతరత్రా అంశాలపై లోతైన విశ్లేషణతో పాత్రికేయుడిగా కొనసాగుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను సుడోమేధావి అంటూ ఈటల చేసిన వ్యాఖ్యలు జర్నలిజాన్ని కించపర్చేలా ఉన్నాయన్నారు. పార్టీలు మారి రాజకీయ పబ్బం గడుపుకునే ఈటల సుడో పొలిటిషియన్ అని అభివర్ణించారు. క్షమాపణ చెప్పకుంటే జర్నలిస్టు యూనియన్ అధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పీటీఎల్ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లోని పార్ట్ టైం లెక్చరర్స్ (పీటీఎల్) సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ (పీటీఎల్) అధ్యక్షుడు సోమేశ్వర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్‌ను కలిసి వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. పర్మనెంట్ అధ్యాపకుల నియామకాలకు అర్హత ఉండి రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఎంపికైన పార్ట్ టైం అధ్యాపకులను చిన్న చూపుచూడటం తగదన్నారు. వారిని కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని,ప్రతినెల రూ.50వేల చొప్పున 12 నెలల వేతనం చెల్లించాలని కోరినట్లు తెలిపారు. పీటీఎల్ నేతలు జానకీరెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్, కరుణకర్, చీకట్లో శ్రీనివాస్, సురేశ్, జీవన్, ప్రశాంత్, వేణు పాల్గొన్నారు.

నేడు తార్నాక చౌరస్తాలో నిరసన

లాలాపేట: తార్నాక చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నేడు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని తలపెట్టినట్లు డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలతోనే హబ్సిగూడ ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ చేపడుతున్నామని కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జైలు శిక్ష, జరిమానాలు

రసూల్‌పురా: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి నాంపల్లి కోర్టు న్యాయమూర్తి శుక్రవారం జైలుశిక్షతో పాటు జరిమానాలు విధించారు. తిరుమలగిరి ట్రాఫిక్ పీఎస్ సీఐ మధుబాబు నేతృత్వంలో గురువారం రాత్రి టీచర్స్ కాలనీ, ఆకాష్ ఇనిస్టిట్యూట్ సమీపంలో డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు. మొదటిసారి పట్టుబడిన వారిలో అధిక మోతాదులో మద్యం తాగిన ఐదుగురు ఆదిలాబాద్‌కు చెందిన రమేశ్, మహబూబ్‌నగర్‌కు చెందిన మధు, సికింద్రాబాద్‌కు చెందిన కే. మధుసూదన్ రావు, అల్వాల్‌కు చెందిన లారీ డ్రైవర్ జి. శీనివాస్, బొల్లారానికి చెందిన వైపీ. సుధాకర్‌కు ఒక్కొక్కరికి 2 రోజుల పాటు జైలుశిక్షతో పాటు రూ. 2100 జరిమానా విధించారు. అదేవిధంగా మూడోసారి పట్టుబడిన తూప్రాన్‌కు చెందిన చంద్రశేఖర్‌కు ఏడురోజులు, రెండోసారి పట్టబడ్డ అల్వాల్‌కు చెందిన కొండయ్యకు 4రోజులు,కొంపల్లికి చెందిన ఏసి.శ్రీదేవ్‌కు రెండు రోజులు, కరీంనగర్‌కు చెందిన సందీప్‌రావు ఒకరోజు జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 3,300 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

జిల్లా జడ్జికి సన్మానం

లాలాపేట: సిటీ సివిల్ కోర్టు సికింద్రాబాద్ జిల్లా జడ్జి సీహెచ్ అప్పల నర్సింహామూర్తి ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో శుక్రవారం పలువురు న్యాయవాదులు ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిటీ సివిల్ క్రిమినల్ కోర్టు న్యాయవాదులు రాజలింగం, ఎస్‌బీఏ వసంత, టీవీ రమణ, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

నీటి సమస్యకు త్వరలో పరిష్కారం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో కలుషిత తాగునీటి సరఫరా సమస్యకు పరిష్కారం చూపుతామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం బ్రాహ్మణబస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తామని, అలాగే కొత్త పైప్‌లైన్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. జలమండలి సెక్షన్ మేనేజర్ ప్రియాంక, బీజేపీ నాయకులు అజయ్‌నాయుడు, సతీశ్‌రాజ్ పాల్గొన్నారు.

రైల్వే కుటుంబాలకు క్రెడిట్ సొసైటీ

సికింద్రాబాద్: రైల్వే కుటుంబాలకు క్రెడిట్ సొసైటీ అండగా ఉంటున్నదని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి పేర్కొన్నారు. సొసైటీ సభ్యుడు, రైల్వే ఆసుపత్రి ఉద్యోగి జంగయ్య మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులకు మంజూరైన మ్యూచ్‌వల్ బెనిఫిట్ ఫండ్ రూ. 3.08 లక్షల చెక్కును శుక్రవారం సొసైటీ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీకి జంగయ్య బకాయిపడిన రుణం రూ.3 లక్షలు కూడా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రవిశంకర్, రాజేందర్, విజయలక్ష్మి, చక్రధర్ పాల్గొన్నారు.

ఇరిసెట్, ఎంఎంఎంయూటీ ఒప్పందం

లాలాపేట: సికింద్రాబాద్ ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ ఆండ్ టెలీ కమ్యునికేషన్స్ (ఇరిసెట్) గోరఖ్‌పూర్‌లోని మదన్ మోహన్ మాల్వియా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎంఎంయూటీ) అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు శుక్రవారం తార్నాకలోని ఇరిసెట్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాస్తవ, ఎంఎంఎంయూటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జైప్రకాష్ సైనీ రైల్వే సిగ్నలింగ్ ఆటోమేటిక్ ట్రెన్ ప్రొటక్షన్ సిస్టం-కవాచ్ ఇన్ బీటెక్ ప్రోగ్రాంను ప్రవేశపెట్టేందుకు పరస్పరం ఒప్పంద పత్రాలపై సంతకం చేసి మార్చుకున్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు రాజేశ్‌కుమార్ పాండే, గౌరవ్ గోవియల్, యూనివర్సిటీ డీన్ ప్రొ. పీకే మిశ్రా, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాఖీ కట్టేందుకు వచ్చి.. మహిళ అదృశ్యం

సికింద్రాబాద్: సోదరుడికి రాఖీ కట్టేందుకు రాజస్థాన్ నుంచి నగరానికి వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. వివిధ ప్రాంతాల్లో తన సోదరి కోసం ఆరా తీసిన సోదరుడు శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రంలోని పాలికి చెందిన లీలాదేవి (35) నగరంలోని చింతల్ మధురానగర్‌లో నివాసం ఉంటున్న తన సోదరుడు దేవేందర్‌చౌదరికి రాఖీ కట్టేందుకు ఈనెల 25న నగరానికి వచ్చింది. ఈనెల 27న తన సోదరిని సొంతురుకు పంపేందుకు లీలాదేవిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఏడో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై హిస్సార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించి తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు తన సోదరి రాజస్థాన్‌కు రాలేదని బంధువులు దేవేందర్‌చౌదరికి సమాచారం అందించారు. దీంతో పలు ప్రాంతాల్లో ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండాపోవడంతో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లీలాదేవి ఆచూకీ తెలిసిన వారు 4403781896 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వరుస రోడ్డు ప్రమాదాలు విచారకరం

లాలాపేట: హబ్సిగూడ ప్రధాన రహదారిపై వరుస రోడ్డు ప్రమాదాలు జరగడం విచారకరమని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల తార్నాక హనుమాన్‌నగర్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి కామేశ్వరీ హబ్సిగూడలో స్కూటీపై వెళ్తుండగా లారీ ఢీకొని మృతి చెందింది. దీంతో ఆమె శుక్రవారం హనుమాన్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి కామేశ్వరీ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

ల్యాప్‌టాప్‌లు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు దొంగిలిస్తున్న వ్యక్తిని, ఆ సొత్తును కొనుగోలు చేసిన మరో ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.2.13 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, గోపాల్ వివరాలు వెల్లడించారు. ఏపీలోని ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం పాత మల్లాపురానికి చెందిన బండ్లమూడి చిన్న ఆవులయ్య (30) ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ సమీపంలో ఉంటూ గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. అయితే సునాయాసంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో దొంగతనాలను ఎంచుకున్నాడు. ఎస్ఆర్‌నగర్ బాపునగర్ పరిసరాల్లో బాయ్స్,పీ జీ హాస్టల్స్‌లో కొంత డబ్బు చెల్లించి వారం పదిరోజుల పాటు ఉండి పథకం ప్రకారం ల్యాప్‌టాప్‌లు ఎత్తుకెళ్లేవాడు. 2023 సంవత్సరంలో ఒకటి, 2024 వరుసగా 8 ల్యాప్‌టాప్‌లు చోరీ చేశాడు. వాటిని తెలిసిన వ్యక్తులు నేరెడ్‌మెట్‌లో ఉండే సెల్‌ఫోన్ రిపేరింగ్ షాపు నిర్వాహకులు నందిగామ వెంకట కృష్ణ, మేకల వెంకటేశ్వర్లకు విక్రయించాడు. వారు కూడా నిందితుడి గ్రామానికే చెందినవారని తెలిపారు. విచారణ అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.